

సమాజ హితమే లక్ష్యం కావాలి

యువత చదువుతో పాటు సామాజిక స్పృహను పెంపొందించుకోవాలని సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ టీవీకట్టిమణి పిలుపునిచ్చారు.


- 8లో



యువతా మేలుకో

సార్వత్రిక ఎన్నికల నగారా మోగింది. ఎన్నికల రోజు ఓటు వేయాలంటే ముందుగా ఓటరుగా నమోదై ఉండాలి.

- 8లో



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
గురు (సా॥)	శుక్ర (ఉ॥)
6.15	4.32

న్యూస్‌రీల్

జెడ్పీ సర్వసభ్య సమావేశం వాయిదా

విజయనగరం రూరల్: జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం వాయిదా వేసినట్టు ఇన్‌చార్జి జెడ్పీ సీఈఓ శ్రీధర్‌రాజా తెలిపారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించాల్సిన సర్వసభ్య సమావేశానికి సభ్యులెవరూ రాకపోవడంతో గంటపాటు వేచిచూసిన అధికారులు ఉదయం 11.30 గంటలకు కోరం లేక వాయిదా వేస్తున్నట్టు ఇన్‌చార్జి సీఈఓ శ్రీధర్ రాజా ప్రకటించారు.

భక్తిశ్రద్ధలతో రాజగోపుర కలశ ప్రతిష్ఠ

- ముగిసిన వేణుగోపాలస్వామి కల్యాణ మహోత్సవాలు



పుష్పగిరి వేణుగోపాలస్వామి ఆలయం రాజగోపుర కలశాలను తీసుకెళ్తున్న భక్తులు

జామి: ఎంతో పురాతనమైన, ప్రసిద్ధిగాంచిన అన్నంరాజుపేట పంచాయతీ పుష్పగిరి వేణుగోపాలస్వామి ఆలయంలో ఈ నెల 19 నుంచి నిర్వహించిన స్వామివారి కల్యాణమహోత్సవాలు బుధవారంతో ముగిశాయి. చివరిరోజు స్వామివారి రాజగోపుర కలశ ప్రతిష్ఠ, పూర్ణాహుతిని వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముందుగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. ఆలయ ఆవరణలో రాజగోపుర కలశాలను ఊరేగించి ప్రతిష్ఠించారు. భక్తులకు అన్నసమారాధన చేశారు.

పోలమాంబ హుండీల ఆదాయం రూ.8,67,949



మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి జాతరలో భక్తులు హుండీలలో సమర్పించుకున్న కానుకలను జిల్లా దేవదాయశాఖ అధికారి డి.వి.వి.ప్రసాదరావు ఆధ్వర్యంలో బుధవారం లెక్కించారు. ఈ నెల 2వ తేదీ నుంచి 27వ తేదీ వరకు చదురుగుడిలోని హుండీల నుంచి రూ.6,43,945లు ఆదాయం రాగా, వనంగుడిలోని హుండీల నుంచి రూ.2,24,004లు వచ్చిందని ఈఓ సూర్యనారాయణ తెలిపారు. 158 గ్రాముల వెండి, 3 గ్రాముల బంగారంను భక్తులు సమర్పించారన్నారు.

లక్ష్యంతో సాగేవారికి ఉజ్వల భవిత



పూర్వ విద్యార్థి, శాస్త్రవేత్త దుర్గాప్రసాద్‌ను సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యం

చీపురుపల్లిరూరల్(గరివిడి): విద్యార్థి దశలో లక్ష్యంతో ముందుకు సాగేవారికి ఉజ్వల భవిత సొంతమవుతుందని ఎస్‌డీఎస్ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థి, చంద్రయాన్–3 ఉష్ణోగ్రత కొలతయంత్రం రూపకల్పన శాస్త్రవేత్త కరణం దుర్గాప్రసాద్ అన్నారు. గరివిడి కళాశాలలో ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు, పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులకు బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థి దశలో నేర్చుకున్న విజ్ఞానపరమైన అంశాలు శాస్త్రవేత్తగా ఎదిగేందుకు దోహదపడ్డాయన్నారు. ఉష్ణోగ్రత కొలత యంత్రాన్ని నింగిలోనికి ఎలా పంపించారు, నింగిలోనికి చేరే వరకు తీసుకున్న ప్రయత్నంలో ఎదుర్కొన్న ఒడిదుడుకలు, అనుభూతిని, విద్యార్థి దశలో ఉన్నత లక్ష్యాల వైపునకు వెళ్లేందుకు తీసుకున్న ప్రణాళిక విధానం, ఆయన తీసుకున్న అవార్డులు, రివార్డులను విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం దుర్గాప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు.

వెన్నుపోటు రాజుపై ఇక వేటు!

- ఎమ్మెల్సీ రఘురాజుపై శాసనమండలి సెక్రటరీ జనరల్‌కు ఫిర్యాదు
- శాసనమండలిలో వైఎస్సార్‌సీపీ విప్ పాలవలస విక్రాంత్ వినతి
- మరోవైపు హైదరాబాద్‌లో లోకేశ్ నివాసంలో రఘురాజు ప్రత్యక్షం?
- గొంప కృష్ణ పంచాయితీలో భాగస్వామ్యం



రఘురాజుపై ఫిర్యాదు చేస్తున్న శాసనమండలి విప్ పాలవలస విక్రాంత్

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

వేర్వేరు పార్టీల్లో ఉండే అన్నదమ్ములను చూశాం... కానీ ఒకే ఇంట్లో చక్కగా కాపురం చేసుకుంటున్న దంపతుల్లో భర్త ఒక పార్టీలో, భార్య ప్రత్యర్థి పార్టీలో ఉండటం బహుశా ఇప్పటివరకూ ఎక్కడా చూసిఉండం!. నమ్మి నెత్తిన పెట్టుకున్న పార్టీలకు వెన్నుపోటు పొడిచే ఆ ఉత్తమ దంపతుల గురించి తెలుసుకోవాలంటే శృంగవరపుకోట రావాల్సిందే. వారిలో భర్త ఇందుకూరి రఘురాజు, భార్య ఇందుకూరి సుబ్బలక్ష్మి అలియాస్ సుధారాజు!. జిల్లాలో రాజకీయ, సామాజిక సమీకరణలతో సంబంధం లేకుండా కేవలం అభిమానంతో వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి వారిని అందలం ఎక్కించారు. చివరకు ఆయన మాటను పెడచెవినపెట్టి, ప్రత్యర్థులతో చేతులు కలిపి వైఎస్సార్‌సీపీకే వెన్నుపోటు పొడవడానికి సిద్ధమైపోయారు. తనకు రిజర్వ్డ్ మండలంలో వైస్ ఎంపీపీ పదవి ఇచ్చి, రాజకీయ భవిష్యత్తు ఇచ్చిన వైఎస్సార్‌సీపీని కాలదన్ని సుబ్బలక్ష్మి టీడీపీలోకి ఫిరాయించారు. తాను కూడా ఫిరాయిస్తే ఎక్కడ ఎమ్మెల్సీ పదవి పోతుందోననే భయంతో రఘురాజు మాత్రం పసుపు కండువా వేసుకోలేదు. అదొక్కటి తప్ప తెరవెనుక టీడీపీతో కలిసి ఏ స్థాయిలో కుట్రలు చేస్తున్నారో ఎస్.కోట ప్రజలకు బహిరంగ రహస్యమే.

'కోళ్ల' మేలు కోసం కుతంత్రాలు...

నియోజకవర్గాల పునర్విభజనతో ఉత్తరాపల్లి నియోజకవర్గం రద్దు అయిపోయిన నేపథ్యంలో కోళ్ల కుటుంబం శృంగవరపుకోట అసెంబ్లీ నియోజకవర్గానికి మారింది. రాజకీయ విశ్లేషకుల అభిప్రాయాల ప్రకారం చూస్తే... తొలి నుంచి సొంత పార్టీ నాయకులతో కలహాలు అలవాటైన ఇందుకూరి రఘురాజు 2009 సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి వెన్నుపోటు పొడిచారు. నాటి ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖరరెడ్డి స్వయంగా వారించినా వెనక్కి తగ్గని ధిక్కార స్వభావం ఆయనది. కాంగ్రెస్ పార్టీ టిక్కెట్‌పై పోటీచేసిన అల్లు కేశవ వెంకట జోగినాయుడి ఓటమికి కారణమయ్యారు. ఇండిపెండెంట్ (కాంగ్రెస్ రెబల్)గా పోటీచేసి పరోక్షంగా టీడీపీ అభ్యర్థి కోళ్ల లలితకుమారి గెలుపునకు బాటలు వేశారు. ఆ ఎన్నికల్లో జోగినాయుడిపై కేవలం 3,440 ఓట్ల మెజార్టీతో ఆమె బయటపడ్డారు. రాష్ట్ర విభజన తర్వాత జరిగిన 2014 సార్వత్రిక ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ అభ్యర్థిగా రఘురాజు పోటీచేసి టీడీపీ అభ్యర్థి లలితకుమారి గట్టెక్కడానికి ఉపయోగపడ్డారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో అలాంటి కుతంత్రాలేవీ కుదర్లేదు. కొత్తవాడు ఓడిపోతాడనుకుంటే వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కడుబండి శ్రీనివాసరావు 11,365 ఓట్ల మెజార్టీతో లలితకుమారిని మట్టి కరిపించారు. 2024 ఎన్నికల్లో అయినా ఆమెను గట్టెక్కించడానికి రఘురాజు దంపతులు ఒక వ్యూహం ప్రకారం పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు దిగారు. మరోవైపు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి 58 నెలల్లో అమలుచేసిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు మరింత ప్రజాభిమానం సంపాదించుకున్నారు. మళ్లీ అతనికే వైఎస్సార్‌సీపీ టిక్కెట్ ఇస్తే గెలుపు ఖాయమని, లలితకుమారికి మళ్లీ ఓటమి తప్పదని భావించిన రఘురాజు దంపతులు ప్రత్యక్ష యుద్ధానికి దిగారు. ఇది సరికాదని జిల్లాకు చెందిన పార్టీ పెద్దలు మంత్రి బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఇతర నాయకులు హెచ్చరించినా తగ్గలేదు. చివరకు పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా పర్యటనకు వచ్చినప్పుడలా... కడుబండి శ్రీనివాసరావుకు మద్దతుగా ఉండాలని హితవు పలికారు. పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. తొలుత రఘురాజు భార్య సుబ్బలక్ష్మిని, ఆయన అనుచరులను టీడీపీ అభ్యర్థి కోళ్ల లలితకుమారి స్వయంగా విజయవాడ తీసుకెళ్లి ఇటీవల లోకేశ్‌తో టీడీపీ కండువా వేయించారు. తన భర్తకు ఎమ్మెల్సీ పదవి, తనకు వైస్ ఎంపీపీ పదవి ఇచ్చిన వైఎస్సార్‌సీపీకి వెన్నుపోటు పొడుస్తున్నామనే కనీస నైతిక విలువల్లేకుండా సుబ్బలక్ష్మి ఎంతో సంతోషంగా టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.



లోకేశ్ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్న రఘురాజు భార్య సుబ్బలక్ష్మి. చిత్రంలో కోళ్ల లలితకుమారి, గొంప కృష్ణ (ఫైల్)

లేకలేక వచ్చిన పదవి కోసం...

ఇందుకూరి రఘురాజు రాజకీయ నేపథ్యం చూస్తే ఎస్.కోట మండలంలో ఆయన ప్రభావం అంతంతమాత్రమే. తన చేతిలో ఉన్నాయని చెబుతున్న నాలుగు ఊర్లలో కూడా టీడీపీకే మెజార్టీ ఓట్లు ఉండటం గమనార్హం. ఇలాంటి పరిస్థితుల్లో సామాజిక, రాజకీయ సమీకరణాలతో నిమిత్తం లేకుండా, అదీ జిల్లాలో అప్పటికే క్షత్రియ సామాజికవర్గానికి చెందిన డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు ఎమ్మెల్సీ పదవిలో ఉన్నా అదే సామాజికవర్గానికి చెందిన ఇందుకూరి రఘురాజుకు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ పదవిని ఇచ్చి గౌరవించింది. ఆయన భార్య సుబ్బలక్ష్మికి ఎలాంటి రాజకీయ అనుభవం లేకపోయినా వైస్ ఎంపీపీ పదవి వరించింది.

ఇద్దరూ చక్కగా పదవులు అనుభవిస్తూ వైఎస్సార్‌సీపీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడటంపై తీవ్ర విమర్శలు వచ్చాయి. భార్య, నలుగురైదుగురు అనుచరులూ టీడీపీ తీర్థం పుచ్చుకున్నా రఘురాజు మాత్రం తాను ఇంకా వైఎస్సార్‌సీపీలోనే ఉన్నానంటూ బుకాయించడం మొదలెట్టారు. ఎక్కడ టీడీపీ కండువా వేసుకుంటే ఎమ్మెల్సీ పదవి ఊడిపోతుందనేది ఆయన భయం.

రఘురాజుపై ఫిర్యాదు దాఖలు...

ప్రజాప్రాతినిధ్య చట్టం–1951 ప్రకారం ఒక పార్టీ తరఫున చట్టసభల్లో అడుగుపెట్టిన వ్యక్తి తర్వాత సదరు పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం–1985 ప్రకారం అనర్హత వేటు పడుతుంది. ఈ ప్రకారం వైఎస్సార్‌సీపీ నుంచి ఎమ్మెల్సీగా శాసనమండలిలో అడుగుపెట్టిన రఘురాజు ఇప్పుడు పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారని, అతనిపై చర్యలు తీసుకోవాలని విన్నవిస్తూ బుధవారం ఫిర్యాదు దాఖలైంది. శాసనమండలి సెక్రటరీ జనరల్‌కు విప్ పాలవలస విక్రాంత్ ఫిర్యాదు పత్రం అందజేశారు. తదుపరి శాసనమండలి చైర్మన్ మోషేన్‌రాజు స్పందించాల్సి ఉంది. ఈ ఫిర్యాదులోని ఆరోపణలపై వివరణ కోరుతూ రఘురాజుకు నోటీసులు జారీ చేస్తారు. ఆరోపణలు రుజువైతే ఎన్నికల కమిషన్ అనుమతితో రఘురాజు సభ్యత్వాన్ని రద్దు చేసే అవకాశం ఉంది.

వేటు వేయక తప్పని పరిస్థితి...

శృంగవరపుకోట నియోజకవర్గంలో టీడీపీ టికెట్ దక్కించుకున్న కోళ్ల లలితకుమారికి వ్యతిరేకంగా గొంప కృష్ణ గళమెత్తుతున్న సంగతి తెలిసిందే. తనకు టిక్కెట్ ఇవ్వాలని పట్టుబడుతున్నారు. ఆయనకేదో ఎమ్మెల్సీ ఆశచూపించి పక్కకు తప్పించే ఆలోచనతో నారా లోకేశ్ హైదరాబాద్‌లో తన ఇంటికి పిలిపించుకున్నారు. అక్కడ జరిగిన టిక్కెట్ పంచాయితీలో ఎమ్మెల్సీ రఘురాజు పాలుపంచుకొన్నారనేది విశ్వసనీయ సమాచారం. లోకేశ్ ఇంట్లో రఘురాజును చూసి అక్కడికి వెళ్లిన టీడీపీ నాయకులే అవాక్కయ్యారట.



రఘురాజు, సుబ్బలక్ష్మి దంపతులు

పోలింగ్ నిర్వహణలో పీఓ పాత్ర కీలకం



ఎన్నికల ప్రక్రియపై సూచనలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ కార్తీక్

- ఒక్క తప్పు కూడా చేయకూడదు
- కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: ఎన్నికల్లో పీఓల పాత్ర కీలకమని, ఒక్క తప్పుకూడా జరగకుండా చూసుకోవాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి స్పష్టంచేశారు. ఎన్నికల ప్రక్రియ, విధులు, ఈవీఎంలు, వీవీ ప్యాట్ల పనితీరుపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. వివిధ నియోజకవర్గాల నుంచి మాస్టర్ ట్రైనీలుగా ఎంపికైన ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎన్నికల విధులపై బుధవారం శిక్షణ ఇచ్చారు. ఎన్నికల నిర్వహణ, ఈవీఎంల పనితీరు, పీఓలు, ఏపీఓల విధులు, బాధ్యతలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఎన్నికల కమిషన్ రూపొందించిన వీడియోను ప్రదర్శించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి మాట్లాడుతూ పోలింగ్ రోజున, సంబంధిత పోలింగ్ బూత్‌లో పీఓదే సర్వాధికారమని చెప్పారు. అందరి విధులపైనా పీఓలకు అవగాహన ఉండాలని సూచించారు. రీ పోలింగ్‌కు ఎక్కడా అవకాశం ఇవ్వకూడదని, ఎట్టి పరిస్థితిలోనూ తప్పులు, పొరపాట్లు జరగకూడదని స్పష్టం చేశారు. వీలైనంత వరకు వేగంగా పోలింగ్ పూర్తి చేయడానికి కృషి చేయాలన్నారు. పీఓలు నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని ఎన్నికల కమిషన్ ఆదేశాలను కచ్చితంగా అమలుచేయాలని ఆదేశించారు. తమ వ్యక్తిగత అభిప్రాయాలను, అభిమానాన్ని ఎక్కడా ప్రదర్శించకూడదని స్పష్టం చేశారు. పోలింగ్‌కు 90 నిముషాల ముందే మాక్ పోల్ నిర్వహించాలని చెప్పారు. హ్యాండ్ బుక్, చేయాల్సిన, చేయకూడని జాబితా, చెక్ లిస్ట్‌లను తమతో పాటు ఉంచుకోవాలన్నారు. ముందు రోజు రాత్రే తప్పనిసరిగా పోలింగ్ కేంద్రానికి చేరుకోవాలని, ఉదయం 5.30 గంటలకే మాక్ పోల్ జరుగుతుంది కాబట్టి, ముందురోజు రాత్రే బూత్‌లో ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. మొత్తం మూడు దశల్లో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని, అన్ని అంశాలపైనా సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, అసిస్టెంట్ కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్, డీఆర్వో ఎస్‌డీ అనిత, నోడల్ అధికారి సుధాకరరావు, ఆర్వోలు ఎం.వి.సూర్యకళ, బి.శాంతి, బి.సాయిశ్రీ నూకరాజు, మురళీకృష్ణ, మున్సిపల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భవనాలపై పార్టీల రంగులు తొలగించాలి

ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థలు, భవనాలపై ఉన్న పార్టీల రంగులను తొలగించాలని రిటర్నింగ్ అధికారులను కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. సీ–విజిల్ యాప్‌లో వచ్చే ఫిర్యాదులపై వంద నిముషాల్లోపే చర్యలు తీసుకొని నివేదికలు సమర్పించాలన్నారు. ప్రైవేటు భవనాలపై భవన యజమాని అనుమతి పత్రం సమర్పించి ఏదైనా ఒక పార్టీ జెండా, చిన్నపాటి బ్యానర్ లేదా స్టిక్కర్ ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ సీఈఓ ముఖేష్ కుమార్ మీనా జిల్లా కలెక్టర్లతో బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లాలో ఎన్నికల ఏర్పాట్లను కలెక్టర్ వివరించారు.



హాజరైన జిల్లా అధికారులు

ఓటు కోసం దరఖాస్తుకు అవకాశం

విజయనగరం అర్బన్: వచ్చే నెల 14వ తేదీలోగా కొత్తగా ఓటు నమోదు కోసం దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి స్పష్టంచేశారు. వచ్చిన దరఖాస్తులను 25వ తేదీలోగా పరిశీలించి, అర్హులైన వారికి ఓటుహక్కు కల్పిస్తామని చెప్పారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో తన చాంబర్‌లో బుధవారం కలెక్టర్ సమావేశమయ్యారు. ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పులు, ఎన్నికలకు సంబంధించిన ఇతర అంశాలపై చర్చించారు. ఈ వారంలో వచ్చిన దరఖాస్తుల వివరాలను కలెక్టర్ వెల్లడించారు. ప్రస్తుతం రాజకీయ పార్టీలు చేసే ఖర్చు అంతా పార్టీ ఖాతాలోకి వెళ్తుందని, నామినేషన్లు వేసిన తరువాత అభ్యర్థుల ఖాతాలో లెక్కిస్తారని చెప్పారు. ర్యాలీలు, ప్రదర్శనలు, ఇంటింటి ప్రచారం, కరపత్రాల పంపిణీకి కూడా అభ్యర్థులు సంబంధిత ఆర్వోల నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. రెండుమూడు రోజులకు ముందే దరఖాస్తు చేయాలని వీలైనంత త్వరగా అనుమతులు జారీ చేస్తామని చెప్పారు. ఎలక్ట్రానిక్ మీడియా, ప్రింటి మీడియాల్లో ఇచ్చే ప్రకటనలు, నిబంధనలు, వాటి ధరలను కలెక్టర్ వివరించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, డీఆర్‌ఓ ఎస్.డి.అనిత, ఆర్వోలు మురళీకష్ణ, నూకరాజు, రాజకీయ పార్టీల నుంచి రొంగలి పోతన్న, శ్రీనివాసరెడ్డి, నర్సింగరావు, సోములు, దయానంద్, తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి రాజుల ఒత్తిడితో ఆస్పత్రి మూసివేత!



చివరి సారిగా ఆస్పత్రి వద్ద స్థానికులతో ఫొటో దిగిన బొబ్బిలి అమెరికన్ ఆస్పత్రి సిబ్బంది

- సెయింట్ జోసెఫ్(అమెరికన్) ఆస్పత్రిని మూసేసిన నిర్వాహకులు

బొబ్బిలి: నాలుగు దశాబ్దాలుగా బొబ్బిలి పరిసర ప్రాంతాల ప్రజలకు నామమాత్రపు ఫీజులతో వైద్య సేవలందించిన సెయింట్ జోసెఫ్ (అమెరికన్) ఆస్పత్రిని మూసివేస్తున్నట్టు సిబ్బంది బుధవారం ప్రకటించారు. ఈ ఆస్పత్రిలో ప్రసూతి, జ్వరపీడితులకు మంచి సేవలందేవిగా పేరుంది. ఆస్పత్రి భవనాన్ని బొబ్బిలి రాజుల వద్ద 40 ఏళ్ల కిందట నిర్వాహకులు లీజుకు తీసుకున్నారు. లీజు గడువు ముగుస్తోందని, త్వరగా ఖాళీ చేయాలని బొబ్బిలి రాజులు ఒత్తిడి చేయడం వల్లే ఆస్పత్రిని మూసేస్తున్నారన్న ప్రచారం సాగుతోంది. ఇక్కడున్న భవనాల్లో చిన్నపాటి భవనాన్నైనా ఇస్తే ఆస్పత్రిని నడిపిస్తామని సిస్టర్స్ చెప్పినా రాజులు ససేమిరా అనడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఖాళీ చేయాల్సి వస్తోందని పలువురు వద్ద వాపోయినట్టు సమాచారం. పెద్దవాళ్లతో ఢీకొనడం ఎందుకని వారు ఆస్పత్రి పరికరాలను తరలిస్తున్నారు. ఇప్పటికే ఎస్.కోట, విశాఖ ప్రాంతాలకు ఆస్పత్రి సామగ్రి తరలించారు. చివరిగా స్థానికులు, సిబ్బందితో ఫొటో దిగి ఆస్పత్రిని మూసివేస్తున్నట్టు సిస్టర్స్ ప్రకటించారు. సుమారు పది మంది వరకూ ఇక్కడ సిబ్బంది పనిచేస్తున్నారు. విశాఖకు చెందిన జెయింట్ జోసెఫ్ ఆఫ్ ఎన్నసీ సంస్థ ఈ ఆస్పత్రిని పరిమిత ఫీజులతో నిర్వహించేది.

ఎందుకళా?



- టీడీపీ నాయకుడు కళావెంకటరావుకు వెన్నుపోటు
- ఎచ్చెర్ల టికెట్‌ను తన్నుకుపోయిన ఎన్ఈఆర్
- తూర్పుకాపు ప్రాబల్య నియోజకవర్గంలో 'కమ్మ'ని వ్యూహం

సాక్షి ప్రతినిధి, విజయనగరం: టీడీపీలో సీనియర్ నాయకుడు కిమిడి కళావెంకటరావు పరిస్థితి మరీ దారుణంగా మారింది. ఎన్టీఆర్, చంద్రబాబు హయాంలో మంత్రిగా, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఒకప్పుడు చక్రం తిప్పింది ఆయనేనా? అనే సందేహం కళా అనుచరులను వెంటాడుతోంది ఇప్పుడు! గ్రామస్థాయి నాయకుడైన నడికుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్) టీడీపీ నుంచి బీజేపీలోకి ఫిరాయించి మరీ ఎచ్చెర్ల అసెంబ్లీ నియోజకవర్గంలో కూటమి టికెట్‌ను తన్నుకుపోయారు. అతనికి ఇప్పించేందుకు చంద్రబాబు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఆడిన రాజకీయ వైకుంఠపాళిలో కళా పావుగా మారిపోయారని 'సాక్షి' ఇప్పటికే వెలుగులోకి తెచ్చింది. ఆఖరి నిమిషంలో కళా తేరుకొని హైదరాబాద్, విజయవాడ మధ్య చక్కర్లు కొట్టినా వ్యయప్రయాసలు మాత్రమే మిగిలాయి. ఎచ్చెర్ల అసెంబ్లీ నియోజకవర్గంలో కూటమి అభ్యర్థిగా ఈశ్వరరావు పేరును బీజేపీ బుధవారం ప్రకటించింది. తూర్పు కాపు (బీసీ) సామాజికవర్గ ప్రాబల్యం ఉన్న నియోజకవర్గంలో 'కమ్మ'ని వ్యూహం ఫలించింది. టీడీపీలో మరో సీనియర్ నాయకుడు గంటా శ్రీనివాసరావు వద్దు వద్దంటున్న చీపురుపల్లి అసెంబ్లీ నియోజకవర్గం ఒక్కటే కళావెంకటరావు ముందు కనిపిస్తోంది. కుటుంబ హెచ్చరికలను బేఖాతరు చేసి అక్కడికి వెళ్తారా అనేదీ సందేహమే. ఇక మిగిలిన మరో దారి విజయనగరం లోక్‌సభ టిక్కెట్ మాత్రమే. తీరా అక్కడ ఐవీఆర్ఎస్ సర్వేల్లోనూ కళావెంకటరావు వినిపించట్లేదు. దీన్నిబట్టి అక్కడా టికెట్ వచ్చేట్టు కనిపించట్లేదు. పాపం... కళావెంకటరావు! ఆయన పరిస్థితి కరివేపాకు కన్నా అధ్వానంగా అయిపోయిందని ఆయన అనుచరులు చంద్రబాబుపై లోలోనే రగిలిపోతున్నారు.


మది నిండుగా.. ఆశీర్వాదమే అండగా...

ఎన్నికల ప్రచారంలో భాగంగా తమ వీధి, వార్డు, ఇంటికి వచ్చిన వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థులకు ప్రజలు సాదరంగా స్వాగతం పలుకుతున్నారు. విజయ తిలకం దిద్ది మనస్ఫూర్తిగా ఆశీర్వదిస్తున్నారు. ఐదేళ్లలో ప్రభుత్వం అందించిన సంక్షేమ, అభివృద్ధి పాలనతో తమ బతుకులు బాగుపడ్డాయని, సమస్యలు పరిష్కారమయ్యాయని, జీవనంలో స్పష్టమైన మార్పు వచ్చిందని చెబుతున్నారు. మేలు చేసేవారిని గుర్తించుకుంటామని, ఓటుతో మద్దతు తెలుపుతామని స్పష్టం చేస్తున్నారు. గుర్ల, వంగర, తెర్లాం, పూసపాటిరేగ, దత్తిరాజేరు మండలాల్లోని పలు గ్రామాల్లో బుధవారం ఎన్నికల ప్రచారం చేసిన ఎమ్మెల్యే అభ్యర్థులు బొత్స సత్యనారాయణ, తలే రాజేష్, శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, బడ్డుకొండ అప్పలనాయుడు, బొత్స అప్పలనరసయ్య, ఎంపీ అభ్యర్థి బెల్లాన చంద్రశేఖర్‌కు అడుగడుగునా జనం నీరాజనం పలికారు. నాయకులతో కలిసి ముందుకు సాగారు.

– సాక్షినెట్‌వర్క్




గుర్ల: మంత్రి బొత్స సత్యనారాయణకు స్వాగతం పలుకుతున్న పకీరు కిత్తలి గ్రామస్తులు



దత్తిరాజేరు: విజయరాంపురంలో ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య, నాయకులు



పూసపాటిరేగ: కనిమెట్టలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ సురేష్‌బాబు, తదితరులు



కొత్తవలస: ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావుకు సాదర స్వాగతం పలుకుతున్న కొత్తవలస మండలం సంతపాలెం గ్రామస్తులు



తెర్లాం: పెరుమాళిలో ఫ్యాన్ గుర్తును గుర్తించుకోవాలని వృద్ధురాలికి చెబుతున్న బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి, పక్కన ఎంపీ బెల్లాన చంద్రశేఖర్



వంగర: కొట్టిశలో ఓ వృద్ధురాలిని ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న తలే రాజేష్

క్లుప్తంగా

గజపతినగరం సీఐకి బ్రాంజ్ డిస్క్ అవార్డు


సీఐ ప్రభాకరరావు

గజపతినగరం: గజపతినగరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న ఎస్.వి.ప్రభాకరరావు చేసిన సేవలకు గుర్తింపుగా ఆంధ్రప్రదేశ్ డీజీపీ బ్రాంజ్ డిస్క్ అవార్డుకు ఎంపికయ్యారు. ఆయన గతంలో విశాఖపట్నం సిటీ పరిధిలో ఎస్సైగా పని చేసిన కాలంలో వివిధ కేసుల్లో చురుగ్గా స్పందించి కేసుల పురోగతికి కృషి చేశారు. ఈ సేవలను గుర్తించి తనను బ్రాంజ్ డిస్క్ అవార్డుకు ఎంపిక చేసినట్లు సీఐ ఈ సందర్భంగా తెలిపారు. త్వరలో డీజీపీ చేతుల మీదుగా అవార్డును అందుకోనున్నట్లు చెప్పారు. సీఐ ప్రభాకర రావు అవార్డుకు ఎంపిక కావడం పట్ల సర్కిల్ పరిధిలోని ఎస్సైలు, పోలీస్ సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.

రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలు


క్షతగాత్రులను 108 వాహనం ఎక్కిస్తున్న స్థానికులు

గుర్ల: మండలంలోని సొలిపిసోమరాజు పేట వద్ద బుధవారం రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో జరిగిన ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. గుర్ల మండలంలోని గిరడ గ్రామానికి చెందిన బొడ్డు కామేశ్వర రావు, రాజాం పట్టణానికి చెందిన ఓ వ్యక్తి బైక్‌లపై వస్తూ ఎదురెదురుగా ఢీకొన్నారు. అదే సమయంలో నెల్లిమర్ల నుంచి గుర్ల వస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ సూర్యనారాయణ రాజు ప్రమాదాన్ని గమనించి క్షతగాత్రులను 108 ద్వారా విజయనగరం ఆస్పత్రికి తరలించారు.

భార్యను హత్య చేసిన భర్త అరెస్ట్


నిందితుడు ముసలినాయుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు, డీఎస్పీ కృష్ణారావు, సీఐ మంగరాజు

జియ్యమ్మవలస: మండలంలోని సింగనాపురం గ్రామానికి చెందిన గంట ముసలినాయుడు తన భార్య అప్పలనరసమ్మను ఈనెల 21వ తేదీన హత్య చేసిన కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. హత్యకు పాల్పడిన అనంతరం నిందితుడు పరారవగా చినమేరంగి ఎస్సై చిన్నంనాయుడు, సిబ్బందితో కలిసి దర్యాప్తు చేపట్టి మండలంలోని లక్ష్మీపేటలో దుర్గమ్మగుడి వద్ద బుధవారం మధ్యాహ్నం అరెస్ట్ చేశారు. హత్య కోసం ఉపయోగించిన కత్తిని సింగనాపురం వద్ద ఉన్న కాలువ గట్టుపై వెదురు పొదల్లో పడవేసినట్లు నిందితుడు తెలపగా దానిని సీఐ మంగరాజు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు తన భార్యపై అనుమానంతో కత్తితో నరికి హత్యకు పాల్పడినట్లు సీఐ తెలిపారు. కార్యక్రమంలో పాలకొండ డీఎస్పీ జీవీ కృష్ణారావు, చినమేరంగి సీఐ బి మంగరాజు, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు. నిందితుడిని పట్టుకోవడంలో కృషిచేసిన సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

5 కేజీల గంజాయి పట్టివేత

కొమరాడ: మండలంలోని కూనేరు చెక్ పోస్టు వద్ద వాహనాల తనిఖీలో భాగంగా బుధవారం రాత్రి 5 కిలోల గంజాయి పట్టుబడినట్లు స్థానికులు తెలిపారు. రాయగడ నుంచి పార్వతీపురం వస్తున్న ఆర్‌టీసీ బస్సులో ఒడిశాకు చెందిన ఇద్దరు వ్యక్తులు 5 కేజీల గంజాయి తీసుకుని పార్వతీపురం వస్తుండగా వాహనాల తనిఖీల్లో పోలీసులు, రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. దీనిపై ఎస్సై నీలకంఠం వివరణ కోరగా దర్యాప్తు కొనసాగుతోందని ధ్రువీకరించిన వెంటనే కేసు నమోదు చేస్తామని తెలిపారు.

మహిళల గౌరవం మరింత పెరగడానికి..
సీఎంగా జగనే ఉండాలి

- మంత్రి బొత్స సత్యనారాయణ
- గుర్ల మండలంలో ప్రచారం


పెనుబర్తి ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ

గుర్ల: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడంతో పాటు గౌరవం పెరగాలంటే మళ్లీ సీఎంగా జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి రావాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. ఈ మేరకు గుర్ల మండలంలోని పకీరుకిత్తలి, పెనుబర్తి గ్రామాల్లో బుధవారం ఆయన ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లలో ప్రజలకు మంచి చేయడంతో పాటు మహిళలకు గౌరవం పెంచిందని చెప్పారు. పేదలను ఆర్థికంగా అభివృద్ధి చేయడంతో పాటు అనారోగ్యంతో బాధపడుతున్న వారికి మెరుగైన వైద్యం అందించడానికి కృషి చేశామని ప్రజలకు తెలియజేశారు. సంక్షేమ పథకాల అమల్లో ఎటువంటి దళారీలు, లంచాలు లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాలో జమ చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. గ్రామాలకు టీడీపీ నాయకులు వచ్చి లేనిపోని హామీలు ఇచ్చి ప్రజలను మభ్యపెడతారని వాటిని నమ్మవద్దని కోరారు. మరో ఐదేళ్లు అవకాశం ఇస్తే గ్రామాలను రెండింతల అభివృద్ధి చేయడంతో పాటు ప్రజలకు అవసరమైన సంక్షేమ పథకాలను అందిస్తామని హామీఇచ్చారు.

అభ్యర్థి కోసం టీడీపీ వెతుకులాట

ప్రచారంలో పాల్గొన్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాస రావు మాట్లాడుతూ ప్రజలకు చేసిన మంచి వల్ల పేదలు ఆర్థికంగా అభివృద్ధి చెందారన్నారు. డబ్బు మూటలు ఉన్న నాయకుడి గురించి టీడీపీ వెతుకుతోందని, అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు మంచి చేయకుండా ఎన్నికల సమయంలో డబ్బులు ఇస్తే చీపురుపల్లి ప్రజలు ఓటు వేయరన్నారు. టీడీపీకి చీపురుపల్లి నియోజక వర్గంలో పోటీ చేయడానికి అభ్యర్థులు లేక డబ్బులు ఉన్న వారిని వెతుకుతున్నారని ఎద్దేవా చేశారు. రానున్న ఎన్నికలలో ఎమ్మెల్యేగా బొత్స సత్యనారాయణ, ఎంపీగా బెల్లాన చంద్రశేఖర్ పోటీ చేస్తున్నారని వారికి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ చిన్నారుల నుంచి వృద్ధుల వరకు అందరికీ సంక్షేమ పథకాలు అందించడంతో పాటు ప్రతి ఒక్కరి బాధ్యతను సీఎం జగన్‌మోహన్ రెడ్డి తీసుకున్నారని ప్రజలకు తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ సూర్యనారాయణ రాజు, వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు బొత్స సందీప్, జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యవర్గ సభ్యులు పొట్నూరు సన్యాసినాయుడు, జేసీఎస్ కన్వీనర్లు బెల్లాన బంగారునాయుడు, వైస్ ఎంపీపీ తోట తిరుపతిరావు, అంబళ్ల చిన్నారావు, రాగోలు నాగేశ్వరరావు, తుమ్మగుంటి పరమేష్, బూర్లె జోగినాయుడు తదితరులు పాల్గొన్నారు.

యువతా మేలుకో

- ఓటు హక్కు వినియోగించుకో
- ఓటరుగా నమోదుకు ఏప్రిల్ 15 చివరి తేదీ



పార్వతీపురం: సార్వత్రిక ఎన్నికల నగారా మోగింది. ఎన్నికల రోజు ఓటు వేయాలంటే ముందుగా ఓటరుగా నమోదై ఉండాలి. ఓటరుగా నమోదు చేసుకుని ఉన్నా తుది ఓటరు జాబితాలో మీ పేరు లేకుంటే ఓటు వేసేందుకు అనర్హులు. ఇలాంటి వారి కోసమే ఎన్నికల సంఘం చివరి అవకాశం కల్పించింది. తుది ఓటరు జాబితాలో పేరు లేని వారు, ఏప్రిల్ 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన యువతీయువకులు ఓటరుగా నమోదయ్యేందుకు ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించింది. అర్హులైన వారు ఏప్రిల్ 15వ తేదీలోపు ఓటరుగా దరఖాస్తు చేసుకుంటే సంబంధిత అధికారులు దరఖాస్తు వివరాలను పరిశీలించి, అన్ని వివరాలు సక్రమంగా ఉంటే తుది ఓటరు జాబితాలో పేరును చేరుస్తారు.

ఆన్‌లైన్‌లో నమోదు

ముందుగా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎన్‌వీఎస్‌పీ.ఇన్ వెబ్‌సైట్‌లో మీఫోన్ నంబర్‌తో రిజిస్టర్ చేసుకుని లాగిన్ అవ్వాలి. ఆన్‌లైన్ దరఖాస్తులోని వివరాల ఆధారంగా బూత్ స్థాయి అధికారి మీ అడ్రస్‌కు వచ్చి వివరాలను పరిశీలించి, నిర్ధారించుకున్న తరువాత ఓటరు జాబితాలో మీ పేరు చేరుస్తారు. అలాగే హెచ్‌టీటీపీఎస్//ఓటరు పోర్టల్.ఈసీఐ.జీఓవి.ఇన్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి మీ ఫోన్‌నంబర్‌తో రిజిస్టర్ చేసుకోవాలి. లాగిన్ అయ్యాక వెబ్‌సైట్‌లో న్యూ ఓటర్ రిజిస్ట్రేషన్‌లోకి వెళ్లి వివరాలు పొందుపరిస్తే నిర్ధారించిన తరువాత మీపేరు ఓటరు జాబితాలో చేరుస్తారు. మొబైల్ ఓటర్ హెల్ప్‌లైన్ యాప్ ద్వారా ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.

నేరుగా..

18 ఏళ్లు నిండి ఓటరుగా మీకు అర్హత ఉంటే నేరుగా కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. బూత్ లెవెల్ ఆఫీసర్‌కు ఫారం–6 దరఖాస్తు అందజేయవచ్చు. లేదా మండల స్థాయిలో తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులను అందజేయవచ్చు. ఆ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన తరువాత మాత్రమే మీపేరును ఓటరు జాబితాలో చేరుస్తారు. ఓటుహక్కు నమోదుపై ఎలాంటి సందేహాలున్నా టోల్ ఫ్రీ నంబర్ 1950కి ఫోన్‌చేసి నివృత్తి చేసుకోవచ్చు.

జగనన్నే మళ్లీ సీఎం


మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

- సర్వేలన్నీ ఇవే చెబుతున్నాయి
- డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు: కొద్దిరోజుల్లో జరగనున్న ఎన్నికల్లో ప్రస్తుత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డినే మళ్లీ సీఎంగా చేసేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని, సర్వేలన్నీ ఇవే చెబుతున్నాయని డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమశాఖ మంత్రి పీడిక రాజన్నదొర తెలిపారు. స్థానిక విలేకరులతో ఆయన బుధవారం మాట్లాడుతూ ఇటీవల వచ్చిన ఆత్మసాక్షి, ఫస్ట్ స్టెప్ సొల్యూషన్ సర్వేల్లో జగన్‌మోహన్‌రెడ్డి మరలా ముఖ్యమంత్రి కావడం ఖాయమని తేలిందన్నారు. ఐదేళ్లలో సాగిన సంక్షేమ, అభివృద్ధి పాలనకు గుర్తుగా ఫ్యాన్‌గుర్తుకు ఓటేసి జగనన్నను ఆశీర్వదించేందుకు ప్రజలు ఉవ్విళ్లూరుతున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాధికారంలో భాగస్వామ్యం చేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. డిప్యూటీ సీఎం పదవిని గిరిజనులకు కేటాయించి గౌరవించారని తెలిపారు. చిత్తశుద్ధితో పని చేసే నాయకులు, కార్యకర్తలను వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్నామని తెలిపారు. త్వరలో ప్రజలందరికీ ఆమోదయోగ్యమైన మేనిఫెస్టోను జగన్‌మోహన్‌రెడ్డి విడుదల చేయనున్నట్లు చెప్పారు.

గొంప వర్గం దారి ఎటు?

- లోకేశ్‌తో అర్ధాంతరంగా ముగిసిన చర్చలు

శృంగవరపుకోట: ఎస్.కోట నియోజవర్గంలో తెలుగుదేశం పార్టీలో అసమ్మతి సెగలు రాజకుంటున్నాయి. చర్చలతో కుంపటిని ఆర్పేందుకు అధిష్టానం చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. హైదరాబాద్‌లోని చంద్రబాబు నివాసంలో బుధవారం ఎస్.కోట టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గొంప కృష్ణతో లోకేశ్ రెండో దఫా జరిపిన చర్చలు అర్ధాంతరంగానే ముగిశాయి. కోళ్ల లలితకుమారిని కాదని తనకే ఎస్.కోట ఎమ్మెల్యే టికెట్ కేటాయించాలని గొంప కృష్ణ, ఆయన అనుచరులు పట్టుబట్టినట్టు సమాచారం. టీడీపీ పెద్దలు కింజరాపు అచ్చెన్నాయుడు, బుద్దా వెంకన్నలు అందరి సమక్షంలోనే తనకు టికెట్ ఇస్తామని ప్రకటించారని, మరి ఎందుకు అభ్యర్థిని మార్చారంటూ ప్రశ్నించినట్టు తెలిసింది. గొంప కృష్ణ మాటలను లోకేశ్ తోచిపుచ్చి, అధికారంలోకి వస్తే ఎమ్మెల్సీ సీటు ఆఫర్ చేసినట్టు బోగట్టా. ఇప్పుడు మోసం చేశారని... అప్పుడు మోసం చేయరన్న నమ్మకం లేదని, ఇండిపెండెంట్‌గా బరిలో దిగుతామని తేల్చిచెప్పినట్టు సమాచారం. ఈ మేరకు ఎస్.కోటలో అభిమానులు, కార్యకర్తలతో గొంప వర్గం ఆదివారం విస్తృతస్థాయి సమావేశం ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్టు తెలిసింది.

ముగిసిన పదోతరగతి పరీక్షలు

- 10వ తరగతి పరీక్షల రాష్ట్ర పరిశీలకుడు వీఎస్ సుబ్బారావు

లక్కవరపుకోట: ఈ ఏడాది 10వ తరగతి పరీక్షలు బుధవారంతో ప్రశాంతంగా ముగిశాయని రాష్ట్ర పరిశీలకుడు, స్టేట్ టెట్ కన్వీనర్ వీఎస్.సుబ్బారావు తెలిపారు. ఈ మేరకు లక్కవరపు కోట మండల కేంద్రంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఏపీ మోడల్ స్కూల్‌లో గల పరీక్షా కేంద్రాలను బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల పరిశీలకుడిగా ప్రభుత్వం తనను నియమించిందని తెలిపారు. పరీక్షల ప్రారంభం నుంచి రెండు జిల్లాల్లో గల అన్ని కేంద్రాలను పరిశీలించానని చెప్పారు. ఈ రెండు జిల్లాలతో పాటు రాష్ట్రంలో జరిగిన అన్ని పరీక్షా కేంద్రాల్లోనూ ఏ ఒక్క విద్యార్థి కూడా మాస్‌కాపీయింగ్‌కు పాల్పడలేదన్నారు. ఈ ఏడాది ఒక్క విద్యార్థీ డీబార్ అవకపోవడం విశేషమన్నారు. మొత్తంగా పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట ఎల్.కోట ఎంఈఓ సీహెచ్.కూర్మారావు తదితరులు ఉన్నారు.

ఏటీఎం కార్డు ముద్దాయికి రెండేళ్ల జైలు

విజయనగరం క్రైమ్: ఏటీఎం కార్డ్ మార్చి నగదు కాజేసిన ముద్దాయికి రెండేళ్ల జైలు, రూ.1500 జరిమానా విధిస్తూ విజయనగరం అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ బుధవారం తీర్పు వెల్లడించినట్లు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు తెలిపారు. ఈ కేసు వివరాలిలా ఉన్నాయి. స్థానిక మెయిన్ బ్రాంచ్ సమీపంలోని ఏటీఎం కేంద్రంలో 2022 జనవరి 24న మధ్యాహ్నం మెంటాడ మండలం జయితి గ్రామానికి చెందిన బాధితుడు ధాత్రాజు మల్లిస్వామి నగదు విత్‌డ్రా చేసేందుకు వెళ్లి, అక్కడ గుర్తు తెలియని వ్యక్తి సహాయం తీసుకున్నాడు. ఆ వ్యక్తి మల్లిస్వామి చెప్పిన పిన్ నంబర్‌ను గుర్తు పెట్టుకుని, నగదు విత్‌డ్రా చేసిన అనంతరం అసలు ఏటీఎం కార్డు బదులు వేరే ఏటీఎం కార్డు ఇచ్చి అక్కడినుంచి జారుకున్నాడు. అనంతరం నిందితుడు వేర్వేరు ఏటీఎం సెంటర్లలో ఐదు విడతలుగా రూ.86,750 నగదును కాజేశాడు. ఈ మేరకు బాధితుడు మల్లిస్వామి వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేయగా, పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో మోసానికి పాల్పడిన వ్యక్తిని గుంటూరుకు చెందిన కె.విద్యాసాగర్‌గా గుర్తించి అరెస్టు చేసి, కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. కోర్టు ప్రాసిక్యూషన్‌లో నిందితుడిపై నేరారోపణలు రుజువు కావడంతో విజయనగరం అదనపు జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ బి.రమ్య పై విధంగా తీర్పు చెప్పారు.

ప్రహ్లాదరావుకు పదోన్నతి


ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ప్రహ్లాదరావు

విజయనగరం ఫూల్‌బాగ్: జిల్లా అటవీశాఖలో విజయనగరం డిప్యూటీ రేంజ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న ఎ.ప్రహ్లాదరావుకు శ్రీకాకుళం జిల్లా టెక్కలి ఫారెస్ట్‌రేంజ్ ఆఫీసర్‌గా పదోన్నతి లభించింది. ఈ మేరకు బుధవారం జిల్లా అటవీశాఖాకార్యాయంలో అటవీ సిబ్బంది ఆయనను సత్కరించారు. డీఎఫ్ఓ ఎస్.వెంకటేష్, ఎఫ్ఆర్ఓ బి. అప్పలరాజు, ఎస్ఎస్ఓ కేవీఎస్ రాజు, ఎఫ్‌బీఓ శ్రీను, రామారావు, తదితరులు ప్రహ్లాదరావును అభినందించారు. ఇన్‌చార్జ్ డీఆర్ఓ కేవీఎస్ రాజుకు అదనపు బాధ్యతలు అప్పగించారు.కార్యక్రమంలో అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్య


ఆత్మహత్యకు పాల్పడిన శాంతమ్మ

భోగాపురం: మండలంలోని ముంజేరు గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న ఓ మహిళ ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గ్రామానికి చెందిన పిడుగు శాంతమ్మ (55) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఎప్పటికీ ఆరోగ్యం కుదుట పడకపోవడంతో మనస్తాపం చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుంది. ఆమెకు భర్త సత్యనారాయణ ఉన్నారు. పంచనామా అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సుందరపేట సీహెచ్‌సీకి తరలించారు. ఫిర్యాదు మేరకు భోగాపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శాంతియుతంగా ఎన్నికల నిర్వహణ

- ఎస్పీ విక్రాంత్ పాటిల్


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్


సమావేశానికి హాజరైన పోలీసు అధికారులు


ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎస్పీ

పార్వతీపురంటౌన్: శాంతియుతంగా ఎన్నికల నిర్వహణకు తగిన ఏర్పాట్లు చేశామని పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. ఈ మేరకు జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలతో బుధవారం ఆయన జిల్లా పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులు, మర్డర్, ప్రాపర్టీ, వాహనాల దొంగతనం, 174 సీఆర్‌పీసీ కేసులు, మిస్సింగ్, చీటింగ్ కేసులు, సైబ్ నేరాలు, ఇతర కేసులపై సమీక్షించారు. పోలీస్‌స్టేషన్ల వారీగా పెండింగ్ కేసుల వివరాలు, ప్రస్తుత కేసుల స్థితిగతులు, నమోదైన కేసుల్లో నేరస్తుల అరెస్టు, కేసు దర్యాప్తు తీరుతెన్నులపై సంబంధిత పోలీసు అధికారులను ఆరా తీసి కేసుల ఫైల్స్, రికార్డ్స్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు.

ఎన్నికల నిర్వహణకు ప్రణాళికలు

ఎన్నికలను శాంతియుతంగా జరిపించేలా ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని, అందరం ఇప్పటి నుంచే సిద్ధంగా ఉండాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ పోలీస్ అధికారులకు సమావేశంలో సూచించారు. ఎన్నికలు సజావుగా సాగేందుకు ముందుగానే సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాలను గుర్తించి ఆ ప్రాంతాలను సెక్టార్‌ల ప్రకారం విభజించి ప్రత్యేక అధికారులను నియమించి, అక్కడ అనుసరించవలసిన కార్యాచరణ గురించి దిశానిర్దేశం చేశారు. సార్వత్రిక ఎన్నికలకు బందోబస్తు విధులు నిర్వహించేందుకు వచ్చిన ఆర్‌పీఎఫ్ ఫోర్స్‌తో జిల్లాలోని పోలీస్ స్టేషన్ల అధికారులు, సిబ్బంది కలిసి వారి లిమిట్స్‌లో గల సెన్సిటివ్, హైపర్ సెన్సిటివ్ గ్రామాల్లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించాలని సూచించారు.

చెక్‌పోస్టుల్లో తనిఖీలు ముమ్మరం

ఎన్నికల దృష్ట్యా ఏర్పాటు చేసిన సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద ముమ్మర తనిఖీలు నిర్వహించాలని కోరారు. అధికారులు చెక్‌పోస్టులను సందర్శించి, ఆకస్మిక తనిఖీలు చేస్తూ అక్రమ మద్యం, నగదు తరలింపు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని, 24గంటలు అప్రమత్తంగా ఉంటూ ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని ఆదేశాలు జారీచేశారు. ఎన్నికలకు సమాయత్తమయ్యే సందర్భంలో మద్యం, డబ్బు మాదకద్రవ్యాల రవాణా జరిగే ప్రదేశాలను ముందుగా గుర్తించి ఒక మ్యాపింగ్ తయారు చేయాలని సూచించారు. అనంతరం విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీస్ అధికారులు, సిబ్బందికి ఎస్పీ విక్రాంత్ పాటిల్ ప్రశంసాపత్రాలను అందజేశారు. సమావేశంలో పార్వతీపురం ఏఎస్పీ సునీల్ షరోన్, దిశా డీఎస్పీ ఎస్.ఆర్.హర్షిత, పాలకొండ సబ్ డివిజన్ డీఎస్పీ జీవీ కృష్ణారావు, ఎస్సీ,ఎస్టీ సెల్ డీఎస్పీ జి.మురళీధర్, ఏఆర్ డీఎస్పీ వెంకట అప్పారావు, ట్రైనీ డీఎస్పీ ఎస్.ఎం.డి అజీజ్, ఎస్బీ సీఐ సీహెచ్.లక్ష్మణరావు, డీసీఆర్‌బీ సీఐ బీఎండీ ప్రసాదరావు, ఏఆర్ ఆర్ఐ శ్రీరాములు, శ్రీనివాసరావు, జిల్లా సీఐలు, ఎస్సైలు, ఎ. సూపరింటెండెంట్ కోటేశ్వర రావు, పి.సూపరింటెండెంట్ సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ పేరిట మోసంపై కేసు నమోదు

బొండపల్లి: ప్రేమపేరుతో వల వేసి, పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసి మరో పెళ్లికి సిద్ధమైన యువకుడిపై బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై కె.లక్ష్మణరావు తెలిపారు. ఈ కేసు వివరాలిలా ఉన్నాయి. బొండపల్లి మండలం లోని గొట్లాం గ్రామానికి చెందిన యవతి, శ్రీకాకుళం జిల్లా టెక్కలి మండలం, కొండ భీంపురం గ్రామానికి చెందిన తుంపల్లి ఢిల్లీశ్వర్రావులు విజయవాడలో 2021లో ఒక కంపెనీలో పనిచేసేవారు. ఆ సమయంలో పరిచయం ఏర్పడ డంతో ప్రేమించుకున్నారు. పెళ్లి చేసుకుంటానని యువతిని నమ్మించిన ఢిల్లీశ్వరరావు ఇప్పుడు వేరే యువతితో పెళ్లికి సిద్ధం కావడంతో బాధిత యువతి ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు దర్యాప్తు నిర్వహించి కేసు నమోదు చేసి యువకుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై కె.లక్ష్మణరావు చెప్పారు.

సమాజ హితమే లక్ష్యం కావాలి

- కేంద్రీయ గిరిజన యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కట్టిమణి


సెమినార్‌ను ప్రారంభించిన వీసీ ప్రొఫెసర్ టీవీ కట్టిమణి, టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ బిపన్‌జోజో

విజయనగరం అర్బన్: యువత చదువుతో పాటు సామాజిక స్పృహను పెంపొందించుకోవాలని తద్వారా సమాజ హితమైన కార్యక్రమాలు చేపట్టి సమాజ శ్రేయస్సు కోసం పనిచేయాలని సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ టీవీకట్టిమణి పిలుపునిచ్చారు. ప్రపంచ సోషల్ వర్క్‌డేను పురస్కరించుకుని కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయంలోని సోషల్ వర్క్ విభాగం ఆధ్వర్యంలో 'సోషల్ వర్క్–ట్రాన్స్‌ఫార్మేషన్ ఆఫ్ ట్రైబల్ డెవలప్‌మెంట్ అనే అంశంపై బుధవారం జరిగిన సెమినార్‌కు ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజనుల జీవితం చాలా స్వచ్ఛమైనదని వారి అలవాట్లు, ఆచార వ్యవహారాలను అర్థం చేసుకుని వారు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టిపెట్టి అభివృద్ధి పథం వైపు వారిని నడిపించాల్సిన బాధ్యత సోషల్ వర్క్ విద్యార్థులకు ఎంతైనా ఉందన్నారు.

సామాజిక శాస్త్ర అధ్యయనంతో స్పందించే తత్వం

ముఖ్యఅతిథిగా హాజరైన ముంబైకి చెందిన టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ బిపన్‌జోజో మాట్లాడుతూ సామాజిక శాస్త్రాల అధ్యయనం వల్ల యువతలో సమాజంపై స్పందించే తత్వం పెరుగుతుందని సమాజంలో వెనుకబడిన కులాలు, తరగతులు, గిరిజన తెగలు, ఆర్థికంగా వెనుకబడినవారు, స్త్రీలు, దివ్యాంగుల వెనుకబాటుతనాన్ని మెరుగుపరిచి, సామాజిక రుగ్మతలను నిర్మూలించడానికి సోషల్‌వర్క్ ఉపయోగ పడు తుందన్నారు. అనంతరం ముఖ్యఅతిథిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని నిర్వహించిన పోటీల్లో విజేతలకు జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ సోషల్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ శరత్‌చంద్రబాబు, డాక్టర్ నగేష్, ఎం.బయోటెక్నాలజీ హెడ్ డాక్టర్ పరికిండ్ల శ్రీదేవి, డాక్టర్ సురేష్ బాబు, డాక్టర్ కె.దివ్య, డాక్టర్ గంగునాయుడు మండల, డాక్టర్ ఇప్పిలి తారకేశ్వరరావు, డాక్టర్ ఎన్‌పీసూర్యనారాయణ, డాక్టర్ మన్నల ప్రసాద్, డాక్టర్ దాసరి నారాయణ, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

ADMISSIONS
- B.A.5,500, B.Com.6k, B.Sc.10k, P.G.Arts.8k. yearly in Distance at PLNM Degree college ✆ 91774 08565/ 9642656449.M.BA-16k,MCA-20k. Sem.Admns Last Date: 25/3/24. Penalty Fee: 26th-30th March. [G.801057]

COACHING CENTER
- POLYCET, APRJC & EAMCET. New Batches are started today Admissions open. Surya Academy, Kota Jn., Vizianagaram. Ph : 99490 03295 [V. 6442]

BUSINESS OFFER
- ద్వారకాఎంటర్‌ప్రైజెస్:పేపర్ ప్లేట్ & LED మిషన్స్‌పై ప్రతినెల అధిక ఆదాయం, అద్భుత అవకాశం ఉచిత ముడిపదార్థాలు 100% తిరిగి కొనుగోలు ఒప్పందం. 9310515624, 8800496710 [G.1454]
- కంపెనీ అన్ని రకాల బిజినెస్ ల్యాప్ ప్రాజెక్ట్‌ను అందిస్తుంది.వ్యక్తిగత,విద్య,టేక్‌ఓవర్ అగ్రికల్చర్ ఏజెంట్‌కావలెను.DMA Welcome, Salary + కమీషన్ ఆఫీసు, ఖర్చులు, ✆ 9773917835. [T.1252718]

WANTED
- ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్స్ కలవు. మీ పేరు, అడ్రస్ కాల్ / వాట్సప్ చేయగలరు. 90596 63584, 95026 15217. [M.1185004]

- మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9573688520,89197 39694. [M.1233955]
- విజయనగరం జిల్లాలో HPCL ప్రాజెక్ట్ వర్క్ పనిచేయుటకు యువతి యువకులు కావలెను. వీక్లీ పేమెంట్. ఫోన్ : 85999 96668 [V. 786722]
- కష్టమైన్నీ కాదు VIP ఇళ్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషుల ఆయా, నర్సులు, వంటచేయువారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ. 15000 - 40000, ఫ్రీ రూమ్+భోజనం. HYD. ఫోన్. 9014885406. [HA.1411]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹127	₹224	₹ 234

